క్లుప్తంగా

సుస్థిరాభివృద్ధిపై దృష్టి సారించాలి



తాడేపల్లిరూరల్ : రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ నిధులతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా ప్రతినిధులకు ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. దుగ్గిరాల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులకు రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ ఆవశ్యకత, పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు, ఆరోగ్యవంతమైన గ్రామం తదితర అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. తరగతులకు ప్రజా ప్రతినిధులు తప్పని సరిగా హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమలో ఎంపీపీ జబీన్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

తాడికొండ: అధిక కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు మంగళవారం తెలిపారు. పొన్నెకల్లు గ్రామానికి చెందిన బండారు కవిత.. తన భర్త ఆంజనేయులు అధిక కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడని పోలీసులను ఆశ్రయించింది. దీనిపై పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా.. భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఎస్ఐ జోజి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

అనంతవరం(తాడికొండ): అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతవరం గ్రామానికి చెందిన రంకు వెంకటేశ్వర్లు (55) వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో తట్టుకోలేక సోమవారం రాత్రి గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం మరణించాడు. మృతుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకట్రావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎండు తెగులు నివారణకు కృషి



ఫిరంగిపురం: శనగలో ఎండు తెగులు నివారణకు విత్తనానికి పది గ్రాముల ట్రైకోడెర్మావిరిడిని వాడాలని ఏరువాక సీనియర్ శాస్త్రవేత్త వెంకటరాములు అన్నారు. మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శనగ, పత్తి పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతు సదస్సులో మాట్లాడారు. గులాబీ రంగు, కాయ తొలచు పురుగు నివారణకు ఎకరానికి పది లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమారి, ఏవోవాసంతి, విస్తరణాధికారి సుబాని, తేజస్విని, ప్రశాంతి పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం వర్సిటీకి అవార్డు

మంగళగిరి: వీర సైనికుల కుటుంబాలను ఆదుకునేందుకు జిల్లా సైనిక సంక్షేమ బోర్డు.. జిల్లాలోని విద్యా సంస్థలు, యూనివర్శిటీల నుంచి నిధుల సేకరణ చేపట్టింది. రూ.1.25 లక్షల నిధుల సేకరణతో నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ఈ నెల 7న గుంటూరులో జరిగిన ఫ్లాగ్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి యూనివర్శిటీ అసోషియేట్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణకు అవార్డు అందజేసి, సత్కరించినట్లు యూనివర్శిటీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర: సైబర్ నేరాల పట్ల రైతులు, యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు నుంచి వచ్చే లింక్‌లు ఓపెన్ చేయవద్దని ఎస్ఐ పి.కోటేశ్వరరావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాల పట్ల అవగాహన వారోత్సవాలు సందర్భంగా మంగళవారం స్థానిక హైస్కూల్ విద్యార్థులతో మండల కేంద్రం కొల్లిపరలోని ప్రధాన రహదారులల్లో ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఓటీపీ షేర్ చేయడం, ఆన్‌లూన్‌లె ఉద్యోగాల కోసం వెతకడం, ఆన్‌లైన్ కస్టమర్ కేర్ నంబర్స్ వెతకడం మొబైల్ ఫోన్‌కి వచ్చే అనుమానిత లింక్స్ క్లిక్ చేయగానే మన అకౌంట్‌లో ఉన్న డబ్బులు ఖాళీ అవుతాయన్నారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పనిచేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ బీమా!

- లేబర్ ఇన్స్యూరెన్స్‌పై కార్మికుల్లో కొరవడిన అవగాహన
- అసంఘటిత రంగాల్లో చైతన్యం శూన్యం
- ఐదేళ్లకు రూ.110 ప్రీమియం చెల్లిస్తే.. ప్రయోజనాలెన్నో..
- కార్మికుల చేత ఇన్సూరెన్స్ కట్టించే బాధ్యత కార్మిక యూనియన్లదే..



ప్రమాదభరిత పరిస్థితుల్లో పనిచేస్తున్న కార్మికుడు

తాడేపల్లిరూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ ఇన్స్యూరెన్స్‌ను కార్మికులు సద్వినియోగం చేసుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎవరైనా కార్మికుడు ప్రమాదవశాత్తు గాయపడినా, అంగవైకల్యం ఏర్పడినా, ప్రాణాలు కోల్పోయినా వారి కుటుంబం చిన్నాభిన్నం అవుతుంది. ఇలాంటి సమయంలో తప్పక ప్రభుత్వం కార్మికులకు అందించే బీమాలు, వాటి ప్రయోజనాలను తెలుసుకోవాలి. ఒక్క ప్రభుత్వ ఉద్యోగులకు తప్ప ఇక ఎవరు.. ఏ పనిచేసినా వారిని కార్మికుల కిందే ప్రభుత్వాలు పరిగణిస్తాయి. తెల్ల రేషన్ కార్డు ఉంటే చాలు, వారు లేబర్ కార్యాలయానికి వెళ్లి వివరాలు తెలిపి నగదు చెల్లిస్తే వారి కుటుంబానికి ఎంతో కొంత మేలు జరుగుతుంది. సహజంగా కార్మికుల్లో 70 శాతం మంది నిరక్షరాస్యులు కావడంతో ఇలాంటి పథకాలపై అవగాహన ఉండదు. కార్మిక సంఘం నాయకులు వారికి అవగాహన కల్పించి, డబ్బులు కట్టిస్తే ఆ కార్మికుడు, అతని కుటుంబ భవిష్యత్తు బాగుంటుంది.

ప్రయోజనాలు

- పాలసీదారు సహజ మరణం పొందితే రూ.1.30 లక్షల ఇన్సూరెన్స్
- ప్రమాదవ శాత్తు మరణిస్తే..రూ.6 లక్షల బీమా.
- ఒకే ఇంట్లో ఇద్దరు ఆడ పిల్లలుంటే వివాహ నజరానా రూ.30 వేలు. ఇద్దరికీ.
- ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు రూ.30 వేలు చొప్పున వచ్చే అవకాశం.
- ఒక సంవత్సరం పాలసీ పొందిన తర్వాత లబ్ధిదారునికి ప్రమాదం జరిగి 50 శాతం దివ్యాంగులైతే.. ఉంటే రూ.2.50 లక్షలు, అదే నూరు శాతం అయితే రూ.5 లక్షల నష్టపరిహారం.
- బీమా పొందేందుకు కార్మికులు తమ ప్రాంతంలోని కార్మిక అధికారి (లేబర్ ఆఫీసర్) లేదా ఎంపీడీవో లేదా తహసీల్దారును సంప్రదించవచ్చు.

లేబర్ ఇన్స్యూరెన్స్‌కు అర్హులు..

- కూలీలతో పాటు అందరూ అర్హులే.
- తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి.
- ఏడాదికి రూ.22లు ప్రీమియం లెక్కన.. ఐదేళ్లకు ఒకేసారి కేవలం రూ.110 మాత్రమే చెల్లించాలి.
- 18 నుంచి 55 సంవత్సరాలు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులు.
- రేషన్, ఆధార్ కార్డుల జిరాక్స్‌లు జత చేయాలి.
- బ్యాంకు చలానా జతచేసి లేబర్ కార్యాలయంలో ఇవ్వాలి.



మహిళా కార్మికులు

ఇన్సూరెన్స్ ఉన్న విషయం మాకు తెలియదు



ప్రభుత్వాలు కార్మికుల కోసం ఇన్సూరెన్స్ ఏర్పాటు చేశాయని మాకు తెలియదు. గత 25 ఏళ్ల నుంచి నేను తాపీ పని చేస్తున్నాను. నా కళ్ల ముందే ఎంతోమంది కార్మికులు ప్రమాదవ శాత్తు ప్రాణాలు కోల్పోయారు. వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లేక ఎంతో ఇబ్బంది పడుతున్నారు. కార్మికులకు అవగాహన కల్పించి కార్మిక సంఘ నాయకులు అండగా నిలవాలి. – ఎస్కె బాషా, తాపీమేస్త్రి

నా తమ్ముడు ప్రమాదంలో చనిపోతే..



నేను, నా తమ్ముడు ఊహ తెలిసిన దగ్గర నుంచి లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాం. ఆగి ఉన్న లారీ కింద పనిచేస్తుండగా ముందుకు కదిలి టైర్ల కింద పడి తమ్ముడు చనిపోయాడు. ఇది జరిగి 8 ఏళ్లు అవుతోంది. ఇన్సూరెన్స్ అందలేదు. మాలాంటి పేదలకు ఇలాంటి ఇన్సూరెన్స్ ఉందని తెలియదు. ఎవరూ చెప్పలేదు. – సుబ్రహ్మణ్యం, లారీ కార్మికుడు

ప్రతి కార్మికుడు ఇన్సూరెన్స్ చేయించుకోవాలి



రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం ఏర్పాటు చేసిన చట్టాలతో పాటు ఇలాంటి ఇన్సూరెన్స్ పథకాలను కూడా తెలుసుకోవాలి. ప్రతి ఏటా రూ.22లు చెల్లిస్తే ఆ కార్మికుడికి కేంద్ర ప్రభుత్వం అనేక రకాలుగా ఆ పథకాన్ని వర్తింప జేస్తుంది. ఆ ఇన్సూరెన్స్ బాధిత కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుంది. మన దగ్గర పనిచేస్తున్న వారికి తెలియజేయాలి. – నాగబాబు, తాపీ మేస్త్రి

నేడు జంగంగుంట్లపాలెం వైఎస్సార్ సీపీ నేతల పర్యటన

తాడికొండ: నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మేడికొండూరు మండలం జగంగుంట్లపాలెంలో రైతు సమస్యలపై రైతు సోదరులను కలిసే కార్యక్రమం జరగనుందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, గుంటూరు నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్ర బాబు (డైమండ్ బాబు) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబు, పార్లమెంటు పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి హాజరై రైతుల సమస్యలు, గిట్టుబాటు ధర, ధాన్యం సేకరణపై రైతులను కలిసి సమస్యలు తెలుసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

తెనాలిరూరల్: అప్పుల బాధతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. సేకరించిన వివరాల ప్రకారం మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన గాజులవర్తి కోటేశ్వరమ్మ తెలిసిన వాళ్ల దగ్గర అప్పు తీసుకుంది. తీసుకున్న అప్పు కంటే ఎక్కువ చెల్లించానని, అయినా ఇంకా చెల్లించాలని అప్పు ఇచ్చిన వాళ్లు అంటున్నారని వాపోతూ మంగళవారం పురుగుల మందు తాగి సెల్ఫీ వీడియో తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అప్పు చెల్లించకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే సెల్ఫీ వీడియో తీసిందన్న వాదనా వినిపిస్తోంది. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులతో ఉపాధ్యాయులు



ఎంపికైన క్రీడాకారులు చక్రి, జీవరత్నం

మేడికొండూరు: మండల పరిధిలోని కొరప్రాడు గ్రామానికి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిస్తున్నారని మండల అసోసియేషన్ ప్రెసిడెంట్ మొఖరాల శ్రీనివాసరావు, సెక్రెటరీ మానుకొండ బ్రహ్మాజీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల కొరప్రాడులో మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల అభినందన సభ ఏర్పాటు చేశారు. శ్రీనివాస రావు, బ్రహ్మాజీ మాట్లాడుతూ గత రెండేళ్లలో మండలం నుంచి దాదాపు 50 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి సమ్మర్ శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తామన్నారు. సభకి ముఖ్య అతిథిగా పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ శివకుమార్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక

ఫిరంగిపురం: మండల కేంద్రానికి చెందిన బి.చక్రి, డి.జీవరత్నం సౌత్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ పోటీలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరుపున జట్టుకు ఎంపికైనట్లు మండల ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు, కార్యదర్శి వి. శ్రీనివాసరావులు మంగళవారం తెలిపారు. ఈ నెల 8న యూనివర్శిటీలో నిర్వహించిన ఇంటర్ కాలేజీ ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొని జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20న కేరళలోని కాలికట్ యూనివర్శిటీలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

అడిషనల్ ఎస్పీ రవికుమార్



విలేకరులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రవికుమార్



పేరేచర్ల జంక్షన్‌లో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మంగళగిరి: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగర పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం ఆధునిక టెక్నాలజీని కొందరు నేరస్తులు వాడుకుని యువతను మోసం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఓటీపీలు, కేవైసీ వివరాలు ఎవరికీ షేర్ చేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఇంటర్నెట్ బ్యాకింగ్ అంటూ కొందరకు ఫోన్ పే, గుగూల్ పే వివరాలు అడిగినా ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పోలీస్, ఆర్మీ దుస్తులు ధరించి మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ భార్గవి, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్ , కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ నిర్మల జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడికొండూరు: సోషల్ మీడియా పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ హెచ్చరించారు. మండల పరిధిలోని పేరేచర్ల జంక్షన్‌లో మంగళవారం యూనివర్సల్, ఎస్ఆర్ఐ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదస్సులో సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు పట్ల విద్యార్థులు, అధ్యాపకులు అందరూ జాగ్రత్త వహించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత సమాచారంతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంక్ ఆన్లైన్ మోసాలు సోషల్ మీడియా వచ్చే ఫోన్ కాల్స్ లింకులు పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్సై ఖాజీబాబు, ఏఎస్ఐ రాజు, స్పెషల్ బ్రాంచ్ నుంచి రమేష్, సిబ్బంది వెంకట్, జానీ, షంషుద్దీన్, ఎస్ఆర్ఐ కళాశాల ఏవో సీతారామయ్య, ఎన్నారై కళాశాల అధ్యాపకులు చంద్రమౌళి, యూనివర్సల్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పామిశెట్టి బాల స్వామి, యూనివర్సల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కోటిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఎన్. రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.మర్రెడ్డి, కళాశాల ప్రథమ సంవత్సర విభాగాధిపతి ఎ.ఇన్నారెడ్డి, యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జయరామి రెడ్డి, బోధన సిబంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా

తాడేపల్లిరూరల్ : స్విమ్మింగ్ అంతర్ రాష్ట్ర పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ గెలిచిన క్రీడాకారులకు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా మంగళవారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అలీమ్ బాషా మాట్లాడుతూ ఈ నెల 7, 8 తేదీలలో 9వ ఏపీ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్స్ జూనియర్, సబ్ జూనియర్ ఈతల పోటీలో విశాఖపట్టణంలో జరిగాయని, ఈ పోటీలలో మంగళగిరి పట్టణంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొహమ్మద్ సంషేర్‌ఖాన్ మెమోరియల్ స్విమ్మింగ్ పూల్ వీరందరూ శిక్షణ పొందారని, జాతీయ స్థాయిలో స్విమ్మింగ్‌లో మన కార్పొరేషన్ నుండి ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎంపికైన ఎస్కె నజ్రీన్, ఎస్కె నస్రీన్, ఎం. లక్ష్మి పావనిలను అభినందించారు. జాతీయ స్థాయిలో ఎంపిక కావడానికి శిక్షణ ఇచ్చిన శిక్షకులు పడమట నాంచారమ్మను, నాగేశ్వరరావును కమిషనర్ అభినందించారు.

భవితా స్కూల్లో దివ్యాంగుల దినోత్సవం



మేడికొండూరు: మండల కేంద్రమైన మేడికొండూరులోని భవిత స్కూల్‌లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి జి. ఏసురత్నం మాట్లాడుతూ దివ్యాంగులకు భవిత స్కూల్లో అందించే ప్రభుత్వ సేవలను వివరించారు. దివ్యాంగులకు పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత స్కూల్ ఉపాధ్యాయులు బొడ్డు సుబ్బారావు, శిరిగిరి గణేష్, మండల విద్యాశాఖ అధికారి 2 హలీమ్, ఉపాధ్యాయులు, జోజప్ప, బైరాగి, గోపీ, కొండలరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు అర్జీల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



సమస్యలు వింటున్న తహసీల్దార్ కె.నాసరయ్య

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. అడంగల్, పట్టాదారు పాసు పుస్తకాల కోసం 14 అర్జీలు, సర్వేకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో, సబ్‌రిజిస్ట్రార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేరేచర్లలో రెవెన్యూ సదస్సు

మేడికొండూరు: భూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు తహసీల్దారు హరిబాబు తెలిపారు. పేరేచర్లలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ పరిధిలో అధిక సంఖ్యలో ప్రజలు రెవెన్యూ సదస్సులో పాల్గొని అర్జీలను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పాములపాటి శివన్నారాయణ, పేరేచర్ల ఎంపీటీసీ పాములపాటి సురేష్, ఏఎస్ఐ రాజు పాల్గొన్నారు.

మోతడక రెవెన్యూ సదస్సుకు 27 అర్జీలు

మోతడక(తాడికొండ): మండలంలోని మోతడక గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 27 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు కె.నాసరయ్య తెలిపారు. 10 ఆర్‌వోఆర్, అడంగల్ చేర్పులకు సంబంధించి అర్జీలు రాగా 17 సర్వే సంబంధిత సమస్యలపై అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. సమస్య వెంటనే పరిష్కారించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కని పరిష్కార మార్గమన్నారు. ఈ సదావకాశం ఉపయోగించుకొని రైతులు తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. సర్పంచ్ యడ్లపల్లి పార్వతి, ఆర్ఐ హనుమంతరావు, టీడీపీ నాయకులు కంచర్ల శివరామయ్య పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

పాస్ బుక్కుల కోసం వినతి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలో లంక భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు, పాస్ బుక్కులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు తహసీల్దార్ ఐ.సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పెదకొండూరు గ్రామంలో రైతులు కొన్ని సంవత్సరాల నుంచి లంక భూములు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. ఆ భూములకు ఇంతవరకు ఏ ఆధారం లేదని, తుఫానులు, వరదలు వచ్చి రైతులు నష్టపోతే వారికి నష్టపరిహారం చెల్లించరని చెప్పారు. వారు పండించిన పంటను రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయరని, రైతులకు పాస్ పుస్తకాలు అందజేసి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. డీటీ ఐ. ప్రశాంతి, ఆర్ఐ త్రివేణి, సర్వేయర్ ఎ. గోపాలరావుకు కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. సాగుదారులు దాసరి విజలక్ష్మి, వెలివెల ధనంజయ్‌రావు, అనిశెట్టి వెంకటేశ్వరరావు, అంకం శేషగిరి రావు, మొలబంటి ఏడుకొండలు, శీలం వీరరాఘవయ్య, బర్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక గోడను తొలగించాలి



శ్మశాన వాటికలోకి వెళ్లకుండా అడ్డంగా నిర్మించిన ప్రహరీ

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలంలోని చిలువూరు గ్రామం ఏర్పడినప్పటి నుంచి అక్కడ నివసించే మాదిగలందరూ అదే గ్రామంలోని కాలువ ఒడ్డున ఖననాలు చేస్తున్నారని, ఇప్పుడు ఆ శ్మశాన వాటికకు వెళ్లకుండా కొంతమంది కాంక్రీట్ వాల్ నిర్మించారని, దానిని వెంటనే తొలగించే వరకు ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని ఎమ్మార్పీఎస్ లీగల్‌సెల్ న్యాయవాది సీహెచ్.నాగరాజు తెలిపారు. మంగళవారం చిలువూరు శ్మశానికి వెళ్లకుండా ఏర్పాటు చేసిన కాంక్రీట్ గోడ విషయమై శ్మశాన వాటిక వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ స్మశాన వాటికకు అడ్డంగా గోడ నిర్మించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. మాదిగలను న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. ఈ స్మశానంలోకి వెళ్లకుండా టీడీపీ నాయకురాలు యేళ్ల జయలక్ష్మి, ఆమె కుమారుడిని ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కన్వీనర్ ఏటుకూరి విజయ్‌కుమార్, నాయకులు కొమరాల శ్రీనివాసరావు, వలేటి భూషణం, కాకుమాను శేఖర్, అభ్యాస ఫౌండేషన్ చైర్మన్ చిలువూరు ప్రసాద్, అంబేద్కర్ వాది కొండమూది రాజేష్, కొమ్ము ఆనంద్, చిలువూరు హనుమంతు, చిలువూరు మాణిక్యరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



తాడికొండ: తాడికొండలోని ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి చెరుకూరి శ్రీధర్ 6–10వ తరగతి వరకు చదువుతున్న ప్రతిభావంతులైన 10 మంది పేద విద్యార్థులకు తనవంతుగా రూ.50 వేల విలువ చేసే సైకిళ్లను వితరణగా ఇచ్చారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఏవో కుర్రా అమల, పాలకవర్గ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు చేతుల మీదుగా సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఎం.రవిబాబు హెచ్‌ఎం ఏవీవీ ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు ఎన్‌వీ రమణయ్య పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల దీక్షకు సీఐటీయూ మద్దతు



మద్దతు తెలియజేస్తున్న సీఐటీయూ నాయులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ నిర్వహిస్తున్న దీక్షకు సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, బొందపాటి సూర్యప్రకాష్, నవనీతం, టి.నాగేశ్వరరావు, ఎం. సుబ్బారావులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం చొరవ చూపి, కార్మికుల సమస్యను పరిష్కరించాలని, ఇటువంటి సమస్యలు పరిష్కరిస్తే కార్మిక వర్గంలో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, వై.యహోషువా, ఎం.గురవయ్య, వై.రమాదేవి, ఎస్.ఇంమాంబి, టి. దుర్గారావు, సారమ్మ, శారద, శివకుమారి, నాగమల్లేశ్వరి, అన్నమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.